
పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన

హయత్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో తాగునీటి పైపులైన్ పనులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మహేశ్వరీ కాలనీలో డ్రైనేజీ లైన్ ఏర్పాటు కోసం లెవల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ లైన్లను జాగ్రత్తగా పరిశీలించి లైను నిర్మాణం చేపట్టాలని జలమండలి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రాజు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర్యా నాయక్, బాలు, నర్సింహచారితో పాటు పలువురు పాల్గొన్నారు.

'నాలాల్లో పూడికతీత పనులు వేగవంతం చేయండి'

కొత్తపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ బస్తీల నాలాల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం కామినేని చౌరస్తా సమీపంలో గల భరత్‌నగర్ ఫేజ్ -2, శివమ్మనగర్, అంబేడ్కర్‌నగర్ తదితర బస్తీల్లో జీహెచ్‌ఎంసీ ఏఈ షరీఫ్ తదితర అధికారులతో కలిసి మంగళవారం ఆయన నాలాల్లో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల్లో పైప్‌లైన్లలో మట్టి, ఇసుక పేరుకుపోకుండా పూడిక తీయాలన్నారు. మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమైన చోట నూతన మూతలను ఏర్పాటు చేయాలన్నారు. శివమ్మనగర్, అంబేడ్కర్‌నగర్‌లలో పారిశుధ్య, వీధిదీపాల సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భరత్‌నగర్ ఫేజ్ -2 అధ్యక్షులు కొర్లపల్లి స్వామి, జంగయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి'

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సూచించారు. హయత్‌నగర్ డివిజన్ బీడీఎల్ కాలనీలో వరదనీటి కాలువ పనులు పూర్తైన నేపథ్యంలో అనంతరం చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మంగళవారం కాలనీవాసులతో కలిసి పరిశీలించారు.

'భరత్‌నగర్ -2లో నూతన పైప్‌లైన్లు వేస్తాం'

కొత్తపేట, మే 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ భరత్‌నగర్-2 నుంచి శివగంగ కాలనీ వరకు నూతన పైప్‌లైన్లు వేసేందుకు అంచనాలు సిద్ధం చేస్తామని జలమండలి ఏఈ స్రవంతిరెడ్డి తెలిపారు. కామినేని చౌరస్తా సమీపంలోని ఆర్టీసీ కాలనీ రోడ్ నెం.6లో జరుగుతున్న పైప్‌లైన్ రీ మాడెలింగ్ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. తర్వాత భరత్‌నగర్-2 నుంచి శివగంగ కాలనీల్లోనూ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరత్‌నగర్ ఫేజ్-2 పరిసర ప్రాంతాల్లో రీ మాడెలింగ్ పైప్‌లైన్ల పనులకు సంబంధించిన విరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో భరత్‌నగర్ ఫేజ్ -2 అధ్యక్షులు కొర్లపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి యాపర్ల జంగయ్య, కోశాధికారి చెన్నయ్య, ప్రతినిధులు బాలరాజ్, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని స్వామి వివేకానంద పార్కులో బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వాకర్స్, కాలనీవాసులు
- వనస్థలిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి)

'గోవుల అక్రమ రవాణాను అరికట్టండి'

సైదాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరుతూ అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం డీజీపీ జితేందర్‌కు వినతిపత్రం అందజేశారు. గోవులను నిబంధనలకు విరుద్ధంగా సంతలలో కొనుగోలు చేసి రాత్రివేళలలో తరలిస్తున్నారని పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా నియంత్రణకు మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. గో రక్షణ చట్టాలను అమలుచేయాలని, గోవులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు డీజీపీ సానుకూలంగా స్పందించినట్లు బాలకృష్ణ తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ గుజరాతి సంఘం అధ్యక్షుడు జిగ్నేష్ దోషి, ఆసరా ఫౌండేషన్ అధ్యక్షుడు గౌరీవందన, గోసేవా ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని హాస్టల్స్‌పై చర్యలు తీసుకోండి'

అబ్దుల్లాపూర్‌మెట్, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు హాస్టల్స్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఏలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టల్స్‌పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని ఏళ్లుగా మండల కేంద్రంలో హాస్టల్స్ నిర్వహిస్తున్న బిల్డింగ్ యజమానులు, నిర్వాహకులు ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ. 5 నుంచి 10 వేలను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. హాస్టల్స్ నిర్వాహకులు ఏలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఆయన ఆరోపించారు.

రైతు, లేబర్ చట్టాలను రద్దు చేయాలి: ఏఐటీయూసీ

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): రైతు చట్టాలతో పాటు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్న లేబర్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వామపక్ష కార్మిక సంఘాల డిమాండ్లను పరిష్కరించని పక్షంలో జూలై 9న దేశవ్యాప్తంగా భారత్ బంద్‌ను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సక్రు, సీపీఐ మండల కార్యదర్శి ఎస్.శ్రీదేవి, సహాయ కార్యదర్శి శోభన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

సంతోష్‌నగర్, మే 20(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ చౌరస్తా వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నాలుగు కార్మిక కోడ్లను వెనక్కి తీసుకుని, ఇప్పటికే అమలవుతున్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కార్మికులు ప్రసాద్, రామ్‌కుమార్, కిష్టమ్మ, జంగమ్మ, లక్ష్మీ, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అహల్యా బాయి హోల్కర్‌కు ఘన నివాళి

మన్సూరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకురాలు, హిందూ ధర్మపరిక్షకురాలు అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు మన్సూరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అహల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకల కన్వీనర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కోకన్వీనర్ నందికొండ గీతారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ప్రధానకార్యదర్శి డాక్టర్ సమత, జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు విచ్చేసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా చెట్టుకిందే అమ్మవార్లు

- పూర్తికాని దుర్గమ్మ, ఎల్లమ్మ మైసమ్మ ఆలయాల పునర్నిర్మాణం
- పూజలు చేసేందుకు వాంబేకాలనీవాసుల ఇబ్బందులు


చెట్టుకిందే అమ్మవార్ల ప్రతిమలు

చాదర్‌ఘాట్, మే 20(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్‌లో గల వాంబే కాలనీలో ఉన్న దుర్గమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ ఆలయాల పునర్నిర్మాణ కోసం చేపట్టిన పనులు నాలుగేళ్ల గడుస్తున్నా పూర్తి కాలేదు. కనీసం వాంబే కాలనీవాసులు అమ్మవార్లకు పూజలు చేసుకోడానికి వీలు లేకుండా గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో అమ్మవార్ల ప్రతిమలను చెట్టు కిందే ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి కనీసం పూజలు కూడా చేయలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాంబే కాలనీలో దాదాపు 110 కుటుంబాలు నివాసముంటున్నాయి. కాలనీవాసుల అభీష్టం మేరకు వాంబే కాలనీలోని ఖాళీ స్థలంలో దుర్గమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ ఆలయాలు నిర్మించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ముసారాంబాగ్ కార్పొరేటర్‌గా ఎన్నికైన బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి వాంబే కాలనీలో ఉన్న ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు భూమి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మాణ పనులు చేపట్టేందుకు గుంతలు తవ్వారు. అంతే... అక్కడి నుంచి ఇంతవరకు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికీ ఈ ఆలయాల వద్ద గుంతలను పూడ్చలేక, పనులు చేయించడానికి స్థానికులకు స్తోమత లేక అమ్మవార్ల ప్రతిమలను చెట్టుకిందే ప్రతిష్ఠించారు.

ప్రతి సంవత్సరం ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు, దసరా పండుగల సందర్భంగా దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునే వాంబే కాలనీవాసులు కనీసం పూజలు చేసుకోడానికి వీలులేని పరిస్థితి ఏర్పండి. పలుమార్లు కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డిని కలిసి అమ్మవారి దేవాలయాల పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరితే వాటిని చేపట్టకుండా పెండింగ్‌లో పెడుతున్నారని వాంబే కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.


భూమి పూజ కోసం తవ్విన గుంత

కార్పొరేటర్ ఇంటిని ముట్టడిస్తాం



వచ్చే ఆషాఢ మాసంలో జరగనున్న బోనాల ఉత్సవాల నాటికి వాంబే కాలనీలోని దుర్గమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ దేవాలయాల పునర్నిర్మాణపనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి. లేదంటే వాంబే కాలనీవాసులతో కలిసి ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ఇంటిని ముట్టడిస్తాం.

- చిట్టుపాక ప్రభాకర్ మాదిగ, మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆలయ నిర్మాణానికి తాము సిద్ధమే



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం వాస్తవమే. అయితే, స్థానికులు ఎమ్మెల్యే ద్వారా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పడంతో ఆలయ నిర్మాణం ముందుకు సాగలేదు. ఇప్పటికైనా స్థానికులు సహకరిస్తే ఆలయ నిర్మాణానికి తాము సిద్ధమే.

- బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, కార్పొరేటర్

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి

- జడ్సీని కోరిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయడంతో పాటు వాటిని త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కోరారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను జోనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయనకు సుధీర్‌రెడ్డి వివరించారు. సింగరేణికాలనీ నుంచి న్యూ గడ్డిఅన్నారం వరకు వచ్చే వర్షపునీరు పీఅండ్‌టీకాలనీ రోడ్డు వద్ద ఉన్న రెండు మీటర్ల డయా పైప్‌లైన్ వద్ద కలపాలని సూచించారు. అక్కడ ఉన్న పాత డ్రైన్స్‌లో పేరుకుపోయిన సిల్ట్ తీయించాలన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌బస్తీలో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా అవుట్‌లెట్ ఏర్పాటు చేయాలని కోరారు. చంపాపేట డివిజన్ డిఫెన్స్‌కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్‌కు మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. బైరామల్‌గూడ ఫ్లై ఓవర్ కింద ఒక క్రికెట్ నెట్, బాస్కెట్‌బాల్ కోర్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. బీడీరెడ్డి గార్డెన్స్ వద్ద, తెలంగాణ చౌరస్తా వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, వాటర్ చాంబర్‌లను వెనక్కు జరపాలని, చౌరస్తాలో ఉన్న భవనం ముందు మెట్లను కొంత మేర తొలగించాలని ఎమ్మెల్యే కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హిమపురికాలనీలో పార్కు, జడ్జస్ కాలనీలో స్థలం అక్రమణకు గురైందని, ఆ స్థలాలను స్వాధీనం చేసుకుని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జడ్సీని కోరారు. ఎమ్మెల్యే సూచించిన అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని జడ్సీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈలు కార్తీక్, శ్రీనివాస్, రమేష్ బాబు, సీపీ శ్రీనివాస్‌యాదవ్, ఏసీపీ శాంసన్ తదితరులు పాల్గొన్నారు.


జడ్సీకి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్‌లో డ్రైనేజీ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్

ఎల్బీనగర్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలో డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ కోరారు. కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డిలతో పాటు ఆయన మంగళవారం జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ఆయనకు వివరించారు. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న కాలనీలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దాదాపు 40 కాలనీలలో డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పనులు చేపట్టాలని ఆయన కోరారు. కొన్ని కాలనీలలో పాతలైన్ల స్థానం కొత్తలైన్లు వేయాలన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతిరెసిడెన్సీ నుంచి బాలాజీనగర్ వరకు జరుగుతున్న ట్రంక్‌లైన్ పనులను, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ మిడోస్ కాలనీ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆయన కోరారు. సాహెబ్‌నగర్ సమీపంలోని 21 కాలనీలకు డ్రైనేజీ ట్రంక్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సరూర్‌నగర్ చెరువు వద్ద నూతన ఎస్‌టీపీ నిర్మించాలని కోరారు. ఆయా పనులకు దశల వారీగా నిధులు మంజూరు చేసి పనులు చేపడతామని జలమండలి ఎండీ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. జలమండలి ఎండీని కలిసిన వారిలో ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి తదితరులు ఉన్నారు.


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న మధుయాష్కీ, కార్పొరేటర్లు

'జీహెచ్‌ఎంసీ స్థలంలో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేయండి'

మన్సూరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ ప్రధాన రోడ్డులో కమలానగర్ కాలనీ పక్కన గల జీహెచ్‌ఎంసీకి చెందిన ఖాళీ స్థలం ఆక్రమణకు గురికాకుండా చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కమలానగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఆ స్థలాన్ని కాలనీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమలానగర్ కాలనీ ముఖ్యసలహాదారు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేయడంతో గతేడాది జూన్ 29న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా రాష్ట్ర ఎన్ఫోర్స్‌మెంట్ టీం వచ్చి స్థలాన్ని పరిశీలించి జీహెచ్‌ఎంసీకి చెందిన స్థలంగా తేల్చి ఫెన్సింగ్‌ను కూల్చి వేసి బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. నాటి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది ఆ స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాలని బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారన్నారు. అయినా నేటికీ ఓపెన్‌జిమ్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయకపోగా స్థల రక్షణకు కనీసం ప్రహరీ నిర్మించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రహరీ నిర్మించి ప్రజలకు ఉపయోగపడేలా ఓపెన్‌జిమ్, పార్కును ఏర్పాటు చేయాలని వనం శాంతికుమార్, సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కమలానగర్ కాలనీ ప్రధానకార్యదర్శి చెరుకుపల్లి సత్యనారాయణ, సుదర్శన్, మహేష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు లేవు

హయత్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదని బీజేపీ నేత మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్ ఆరోపించారు. తొర్రూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి బూర నరసయ్యగౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి మిల్లర్లు ముందుకు రావడం లేదని దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాలు, తేమ పేరుతో రైతులను నష్టాల్లోనికి లాగుతున్నారని అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటి బీజేపీ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, జిల్లా కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, నాయకులు బోసుపల్లి ప్రతాప్, నోముల దయానంద్‌గౌడ్, కొత్త రాంరెడ్డి, రమేష్, పురుషోత్తం, భల్దేవ్‌రెడ్డి, అర్జున్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, బాల్‌రెడ్డి, నర్సింహగౌడ్, రవీందర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న బూర నరసయ్యగౌడ్, బీజేపీ నేతలు


మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

మల్‌రెడ్డి రాంరెడ్డికి సన్మానం

మన్సూరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కృషి చేసినందుకు గాను రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి టీజీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం కమిటీ సభ్యులు మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా ఆర్టీసీ సిబ్బంది మరణిస్తే అదే రోజున దహనసంస్కారాల నిమిత్తం రూ.30వేల నగదు అందించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఆస్పత్రుల్లో ఉద్యోగితో పాటు వారి జీవితభాగస్వామి ఇద్దరికి సంబంధించిన బయోమెట్రిక్ నమోదును పొందుపర్చాలా సహకరించాలని మల్‌రెడ్డి రాంరెడ్డి ని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యలపై మల్‌రెడ్డి రాంరెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 16న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆ అంశాల అమలుకు ఉత్తర్వులు జారీ చేశారని వారు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, సజ్జనార్‌లకు రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కమిటీ ముఖ్య సలహాదారు కోటయ్య, రాష్ట్ర కార్యదర్శి సత్యం, కోశాధికారి యూసఫ్, కేఎన్ రెడ్డి, హైదరాబాద్ రీజియన్ అధ్యక్షుడు నర్సింహ, బీఆర్సీ గౌడ్, శేఖర్, బీజేఎం రెడ్డి పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి జారిపడ్డ గీత కార్మికుడు

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స

అబ్దుల్లాపూర్‌మెట్, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడిన గీత కార్మికుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పెద్దఅంబర్‌పేట్ సాయినగర్ కాలనీకి చెందిన పాలెం నరసింహగౌడ్(60) గీత కార్మికుడు. మంగళవారం ఉదయం 10 గంటలకు పసుమాముల రోడ్డులో తాటిచెట్టు ఎక్కుతుండగా కాళ్లకు ఉన్న గుత్తి ఊడిపోయింది. నడుముకు ఉన్న మోకు కూడా జారిపోవడంతో కింద పడ్డాడు. దీంతో కుడి కాలు, చేయి, ఎడమ కాలు, తొంటి భాగంతో పాటు పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. నరసింహ చెట్టుపై నుంచి కింద పడడం గమనించిన స్థానికులు వెంటనే పెద్దఅంబర్‌పేట్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు తీవ్ర గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఇషాకర్‌కు అంతర్జాతీయ డాక్టరేట్ ప్రదానం


ఇషాకర్‌కు డాక్టరేట్‌ను అందజేస్తున్న జాన్‌పాల్

హయత్‌నగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): 33 సంవత్సరాలుగా దివ్యాంగుల సంక్షేమం, సామాజిక, ఆధ్యాత్మిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు గాను షెకీనా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతల ఇషాకర్‌కు తెలుగు క్రైస్తవ వేదాంత విద్యాలయం వారు అంతర్జాతీయ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా ఇషాకర్‌ను ఘనంగా సత్కరించారు. గ్లోబల్ తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రిస్, ట్రాన్స్ వరల్డ్ మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో కువైట్ దేశంలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రాక వేత్త ఏవంజలిస్టు పాటూరి జాన్‌పాల్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను ఇషాకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా జాన్‌పాల్ మాట్లాడుతూ దివ్యాంగుడైనప్పటికీ వేలాదిమంది దివ్యాంగులకు సేవలు అందిస్తున్న ఇషాకర్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాస్టర్ బిషప్ గొల్లపల్లి మోసెస్ కిషోర్‌బాబు, ఏలియా రాజు, రూతమ్మ, నిస్సి, మహేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

యాదుల్లాకు ఓయూ డాక్టరేట్


యాదుల్లాకు డాక్టరేట్ అందజేస్తున్న ప్రొ. మాయాదేవి

చాదర్‌ఘాట్, మే 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దిల్‌సుఖ్‌నగర్ నివాసి మహ్మద్ యాదుల్లా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. విదేశీ హిందీ సాహిత్యంపై చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గౌరవప్రదమైన డాక్టరేట్ సాధించడంలో తనకు అన్నివిధాల సహకరించిన డాక్టర్ సంగీత వ్యాస్ తదితరులకు యాదుల్లా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రాక్‌టౌన్ కాలనీలో వ్యాక్సినేషన్

మన్సూరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీ కమ్యూనిటీ హాలులో పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల వయసు గల వారికి బుధవారం ఉచితంగా వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందని రాక్‌టౌన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

యారాడ తీరంలో బాలుడిని కాపాడిన లైఫ్ గార్డులు


బాలుడిని ఒడ్డుకు తెచ్చిన లైఫ్ గార్డులు

విశాఖపట్నం (సింధియా), మే 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని యారాడ సముద్రంలో సరదాగా స్నానానికి దిగి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన అభిమన్యం (15)ను లైఫ్ గార్డులు కాపాడారు. మంగళవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు పర్యాటకులు యారాడ సముద్ర తీరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అభిమన్యం సముద్రంలో స్నానానికి దిగాడు. కెరటాలు అధికంగా ఉండడంతో ఒక్కసారిగా సంద్రంలోకి కొట్టుకుపోవడంతో పెద్దగా కేకలు వేశాడు. దీంతో సమీపంలో ఉన్న మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డులు (గజ ఈతగాళ్లు) అప్రమత్తమయ్యారు. వెంటనే లైఫ్ గార్డులు సముద్రంలోకి వెళ్లి ఆ బాలుడిని సురక్షితంగా ఒడ్డుకు తేవడంతో ప్రాణాపాయం తప్పింది.

ముగిసిన సునీల్ అంత్యక్రియలు

మన్సూరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కోశాధికారి, శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మంత్రి సునీల్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. బండ్లగూడలోని సహభావన అపార్ట్‌మెంట్స్ నుంచి అంబర్‌పేటలోని శ్మశానవాటిక వరకు కొనసాగిన ఆయన అంతిమ యాత్రలో వివిధ బ్రాహ్మణ సంఘాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సునీల్‌కు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు, ప్రధానకార్యదర్శి లక్ష్మీనరసింహరావు, ఉపాధ్యక్షులు శ్యామసుందర్‌రావు, బాలచంద్రరావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రామాశర్మ, అశోక్‌కుమార్, జయరాం, అక్కిరాజు దుర్గాప్రసాద్, రాజేశ్వరరావు, జీయర్ ట్రస్టు సభ్యుడు మోహన్‌రావు తదితులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలకుంట ఆగమయ్య కాలనీలో నివాసముండే గోసిక సుదేష్ణ(28) ఈనెల 16న నగరంలోని నాచారంలో తమ బంధువుల శుభకార్యానికి వెళ్లింది. ఈ క్రమంలో తన మెడలో ఉన్న 7తులాల బంగారు కాసులపేరు చోరీకి గురైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుదేష్ణ మంగళవారం తన ఇంటి మూడో అంతస్తు నుంచి తన బాబుని తీసుకుని కిందికి దూకింది. దీంతో తీవ్ర గాయాలపాలైన సుదేష్ణను సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. చిన్న బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


రమేష్

వనస్థలిపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శారదానగర్‌లో సాగురి రమేష్(56) భార్య, పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈ నెల 19న సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా రమేష్ బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో భార్య విజయలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.